


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 17 పుష్పం : 35-36 20-5-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 17

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188


## "మౌనం-పరబ్రహ్మ స్వరూపం"

"మౌనం - అంటే కేవలం నోరుమూసుకోవటం కాదు మనోనేత్రాన్ని ముయ్యాలి. దీనినే భగవాన్ "నే నను తలంపు కించెత్తును లేని తానే స్వరూపము అదియే మౌనము" అన్నారు-ఎవరి ఇంద్రియాలు, మనస్సు అంతర్ముఖమై మనోమూలాన్ని చూస్తుందో అతడే నిజమైన మౌని, అతడే జగత్తును జయిస్తాడు. మాట్లాడ వలసినప్పడుమాట్లాడటం-మాట్లాడవలసిన అవసరం లేనప్పడు మాట్లాడకుండా ఉండటం కూడా మౌనమే అంటారు. వంది మాగధులు రాజుల చరిత్రలను ఏవిధంగా వర్ణిస్తూ పొగుడుతారో అదే విధంగా జ్ఞాని మౌనాన్ని వేదాలు శ్లాఘిస్తూ ఉంటాయి. అంతర్ముఖులైన మౌనులు అక్కడక్కడా దైవేచ్ఛానుసారం సంచరిస్తూ ఉంటారు. వారి గురించి వార్తాపత్రికలు గొప్పగా చిత్రించవు వారే భూచక్రా మంతటికీ సార భూతులు. వారు పెదవి విప్పినా, విప్పకపోయినా, మానవసేవచేసే మహత్తర సంస్కర్తలు ఔతారు. చక్రవర్తులనుంచి ఆశించేది, ప్రపంచంలోని గ్రంధాల నుంచి నేర్చుకోనే పాఠాలు ఏమీ ఉండవు. వారు జీవించి ఉన్నంతకాంలం వారి పవిత్ర దర్శనం, వారి దృష్టి పావనత్వమును, ఆనందమును వెదజల్లుతుంది. ప్రపంచం అత్యద్భుతంగా సంస్కరించబడుతుంది. దక్షిణామూర్తి మౌనంలో శిష్యుల సకల సంశయాలు తీరిపోయి సిద్ధి పొందుతారు. "మహానిశ్శబ్దంలోంచి "నేను" అనే తలంపువస్తే అందులోంచి మాటవస్తే, ఆ మాటకే అంత శక్తి ఉంటే ఇక "నిశ్శబ్ధానికి" ఎంత శక్తి ఉంటుందో గ్రహించండి. మౌనం బంగారం, మాటవెండి, మౌనం రాజ మార్గము, శక్తివంతమైనది" అన్నారు శ్రీనాన్నగారు. సాధకుడు మౌనాన్ని ఆలంబనంగా పెట్టుకోవాలి. అప్పడు కూడా మన మనస్సులో ఆలోచనలు ముసురు తున్నప్పటికీ మనం నష్టపోయే శక్తి చాలా తక్కువ, ప్రాణశక్తిని ఎక్కువగా మాట్లాడటం వల్లనే పోగొట్టు కొంటాము. అదే పనిగా కూసే పాముురం ఆయుర్ధాయం తక్కువ, ఉలుకూపలుకూలేని తాబేలు చాలా కాలం జీవిస్తుంది. అది ప్రమాద సంకేతం అందిన వెంటనే తన అవయవాలను సుకుమారంగా లోపలికి తీసుకొని సురక్షిత మౌతుంది, హడావిడిచెయ్యదు. అలాగే సాధకుడు లౌకిక వ్యవహారంలో నాల్గుసార్లు ఆలోచించి ఒక్కమాట మాట్లాడితే ప్రాణశక్తిని రక్షించుకొంటాడు. సంఘ దోషం వల్ల మనస్సు బహిర్ముఖమౌతుంది. అది మండుటెండలాంటిది, అంతర్ముఖం చెటుక్రింద నీడలాంటిది, ఆ చల్లని నీడలో నిలకడగా నిలిచే వాడే నిజమైన సుఖి-నిజమైన మౌని.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్ధవరం

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


20-02-04 గణపవరం ........ 3
24-04-04 జిన్నూరు ........ 10


**సాధనలో ఏ దివ్యనాదాలు నీవు విన్నా, ఏ దివ్య దర్శనాలు నీవు చూచినా,**
**వాటిని వినేవాడూ చూచేవాడూ ఒకడుండాలి అతడే నీలో ఉన్న 'నేను'.**
**'నే నెవరిని?' అని విచారణ ద్వారా ఆ 'నేను'ను అన్వేషిస్తే,**
**విషయాలూ విషయి ఒకటై పోతాయి. ఆపైన ఇక అన్వేషణ లేదు.**
**అంతవరకూ ఆలోచనలు పుట్టుతూనే ఉంటాయి.**
**విషయాలు గోచరిస్తూ మాయమవుతూనే ఉంటాయి.**
**ఏమి జరిగింది, ఏమి జరగబోతుంది అనే ప్రశ్నలు నీకు తప్పవు.**
**విషయి తెలియబడితే విషయాలు విషయిలో లీనమైపోతాయి.**
**- భగవాన్ శ్రీరమణ మహర్షి**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు 20-2-04 గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు చేసేపని శ్రద్ధగాచేయండి, అశ్రద్ధపనికిరాదు, అజాగ్రత్తపనికిరాదు. నాయకులు ఏమిచెపుతారు అంటే బ్యాంకులు అప్పలు ఇస్తున్నాయి, తెచ్చుకోండి అంటారు. అప్పలు తెచ్చుకోవటం వలన మనం అభివృద్ధిలోనికి రాము, పనిశ్రద్ధగా చేసుకొంటే అభివృద్ధిలోనికి వస్తాము. అవసరమయితే అప్పతీసుకోవచ్చు, అందులో పొరపాటులేదు, దానిని సద్వినియోగం చేసుకోవాలి. మనం కష్టపడి పనిచేసుకొంటే మనం బాగుపడుతాము, దేశం బాగుపడుతుంది. పనికి దూరమయితే ఏదేశంకూడా బాగుపడదు. అందుచేత మనం దైవభక్తితో పాటు దేశభక్తిని కూడా పెంచుకోవాలి. దైవభక్తికి దేశభక్తికి సంబంధం ఏమిటి అని మీరు అడగవచ్చు. దేశభక్తి పెంచుకోవటం వలన మనం సేవించే పరిధి, ప్రేమించేపరిధి, పనిచేసేపరిధి పెరుగుతుంది. దేశభక్తి వలన హృదయం విశాలమవుతుంది, బుద్ధి సూక్ష్మం అవుతుంది. దేశభక్తి పరిణామంలో దైవభక్తి కిందమారుతుంది. ఆంజనేయస్వామి యొక్క అంశే షిరిడీ సాయిబాబా. ప్రజలలో భక్తి భావన పెంచటం కోసం, వివేకం పెంచటం కోసం, ప్రజలకు అమృతానుభవం కలుగజేయటం కోసం వచ్చిన అవతారం. ఆయన నామాన్ని స్మరించుకొంటూ, ఆయనరూపాన్ని ధ్యానించుకొంటూ ఉంటే మనం పవిత్రులం అవుతాము. పనియందు గౌరవం, నామస్మరణ ఇవి ముఖ్యంగా మనం నేర్చుకోవాలి. మనకు ఇష్టమైన భగవంతుని రూపాన్ని ధ్యానించు కొంటూ, ఆయన నామాన్ని స్మరించుకొంటూ మనం తరించాలి. ప్రకృతి వలన మనకు కొన్ని బాధలు వస్తాయి, కుటుంబసభ్యుల వలన కూడా కొన్ని బాధలు వస్తాయి, విరోధుల వలన కూడా మనకు కొన్ని సమస్యలు వస్తాయి, ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. వీటి అన్నింటికంటే ఎక్కువగా మనలను బాధపెట్టేది, మనలను హింసపెట్టేది, మనకు అశాంతిని తీసుకొనివచ్చేది మన గర్వం. గర్వంవలననే మనం ఎక్కువ పేచీలు తెచ్చుకొంటాము. మన గర్వమే మనలను పాడుచేస్తోంది అనే విషయం మనకు అర్థం కావటం లేదు. అది గ్రహించుకొని గర్వాన్ని తగ్గించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి, వినయాన్ని పెంచుకోవాలి.

రామేశ్వరంలో రాముడు శివలింగాన్ని స్థాపించాడు. మనం ఏమనుకొంటాము అంటే రాముడు శివుడిని అక్కడస్థాపించాడు కాబట్టి రాముడు వేరు, శివుడు వేరు అని అనుకొంటాము, అదే మాయ. రాముడే శివుడు, శివుడే రాముడు, ఇద్దరూ ఒక్కటే అని మనం గ్రహించలేకపోతున్నాము, ఆ బుద్ధిసూక్ష్మత ఇంకా మనకు రావటం లేదు. మనం





చిన్న కష్టాన్నికూడా ఓర్చుకోలేము. శివుడు కంఠంలో విషం పెట్టుకొని శాంతిగా ఉంటూ అందరినీ అనుగ్రహిస్తూ ఉంటాడు. ఆయన కంఠంలో ఉన్నది విషం, మొఖంలో ఉన్నది శాంతి, జ్ఞానం, వాడే శివుడు. శివుడుకి రూపం లేకపోయినా భక్తులను అనుగ్రహించటం కోసం ఆయన లింగరూపం ధరించాడు, దక్షిణామూర్తి రూపం ధరించాడు. అందుచేత మనం ఆరూపాన్ని ధ్యానించుకొని, ఆనామాన్ని స్మరిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనకు ఆత్మజ్ఞానంలేదు, మనకు ఉన్నది వ్యవహారికజ్ఞానం. కొంతమంది తెలియక వ్యవహారిక జ్ఞానమే ఆత్మజ్ఞానం అనుకొంటున్నారు. మనిషి బతకటానికి ఉపయోగపడే తెలివిని వ్యవహారికజ్ఞానం అంటారు. వ్యవహారికజ్ఞానం కూడా మంచిదే అయితే వ్యవహారిక జ్ఞానం వలన మనకు శాంతి దొరకదు. ఉన్నది బ్రహ్మం ఒక్కటే. ఈ దేహము, మనస్సు ఇదంతా మాయ. అందుచేత సాధనచేసి బ్రాహ్మీస్థితిని పొందు, అంతకంటే సంపాదించవలసింది ఏమీ లేదు అని భగవంతుడు చెపుతున్నాడు. నీకళ్ళకు ఈ ప్రపంచం కనిపిస్తోంది. ఇందులో సూర్యుడు, చంద్రుడు, మొత్తం జీవకోటి అంతాఉంది. మీకళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతాకూడా ఈ దేహంలో ఉంది అన్నారు భగవాన్. సృష్టిలో ఎన్ని రహస్యాలు ఉన్నాయో ఈదేహంలో అన్ని రహస్యాలు ఉన్నాయి అని చెప్పారు. ఈ ప్రపంచానికి బీజం దేహం. మరి దేహానికి బీజం ఎవరు? నేను అనే తలంపే ఈ దేహానికి బీజం. ఈనేను అనేతలంపు ఎక్కడ నుండి వస్తోంది? నీ హృదయంలోనుండే వస్తోంది. అందుచేత హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకొంటే ఈ నేను అంటే ఏమిటోనీకు తెలుస్తుంది, దేహం తెలుస్తుంది, లోకం తెలుస్తుంది, చావుపుట్టుకలు అంటే ఏమిటో తెలుస్తుంది. ముందు ఇది తెలుసుకొంటేనే గాని నీకు ఏదీ తెలియదు. దీనిని తెలుసుకోకుండా మేము ఏదో తెలుసుకొన్నాము అని మీరు అనుకొంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకొంటున్నారు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితములు అన్నప్పుడు ఒక్క బ్రహ్మం మాత్రమే పారమార్థికసత్యం. ఈదేహంఎంత సత్యమో, ఈలోకం ఎంత సత్యమో, పుణ్యపాపాలు ఎంత సత్యమో, భగవంతుడు కూడా అంతే సత్యం. భగవంతుడు ఉన్నాడు, ఆయన మటుకు కుందేటి కొమ్ముకాదు. నీవు బ్రాహ్మీస్థితిని పొందితే, నీకు ఉన్నవస్తువు ఉన్నట్లుగా అనుభంలోనికి వస్తే ఇంక ఏమీలేదు. బ్రహ్మసత్యం, జగత్తుమిథ్యఅంటే జగత్తు అసలులేదు, అదివ్యవహారికసత్యం మాత్రమే. బ్రహ్మంమాత్రమే అసలు సత్యం. అందుచేత బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నంచెయ్యి.

మన మనస్సు ఒకోసారి మనకు విరోధంగా ఉంటుంది, ఒకోసారి స్నేహంగా ఉంటుంది. ఎప్పుడూ మనకు స్నేహితుడిగా, ఎప్పుడూ మనకు మంచి చేసేదిగా మన మనస్సును మలుచుకోవాలి. మన మనస్సు మనకు విరోధిగా ఉంటే ఆవిరోధం తగ్గించుకొని, మనస్సును మనకు అనుకూలంగా తిప్పుకోవాలి, అదేమనం చేయవలసిన సాధన, మనం

ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి, ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మజ్ఞానంరాదు. నూటికి తొంభై విమర్శలకు అసూయ కారణం. ఇతరులు ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తూఉంటే మీరు కంగారుపడకూడదు. అలా కంగారుపడితే మీమీద మీకు విశ్వాసం తగ్గిపోతుంది. మన మీద మనం విశ్వాసం పెంచుకోవాలి, ఏకాగ్రత పెంచుకోవాలి, పవిత్రత పెంచుకోవాలి. పరమపవిత్రుడిని జ్ఞానం వరిస్తుంది. మన చేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేసుకోవాలి. మనకళ్లతో మనం చూసుకోవాలి, మన మనస్సుతో మనస్సును పరిశీలన చేసుకోవాలి. అందుకే ఏకాంతవాసం అవసరం. ప్రతీ మనిషి రోజుకు ఒకగంట ఏకాంతంగా కూర్చొంటే వాడి మనస్సులో ఏమి జరుగుతోందో వాడికి తెలుస్తూ ఉంటుంది. మనస్సు అనేది హృదయంలోనుండి వచ్చిన ఒకతుంపర, ఎక్కడనుండి అయితే ఈ తుంపర వస్తోందో అక్కడకు దానిని పంపగలిగితే మన సాధన పూర్తిఅయినట్లే. ఒకోసారి మన మనస్సు అణుగుతుంది, అప్పుడు మనకు శాంతిగా ఉంటుంది, ఈరోజు ఎంత బాగుంది అని మనకు అనిపిస్తుంది. మనస్సు హృదయంలోనికి వెళ్లి అణిగితేనే మనకు అంతశాంతి వచ్చేస్తుంది. మనస్సు అణిగినప్పుడు మనం అనుభవించే శాంతి కాఫీపైన ఉన్న నురుగు వంటిది. నురుగు నోటికి తగిలితేనే అంత శాంతి వస్తూ ఉంటే మరి కాఫీ తాగినప్పుడు ఎంత శాంతివస్తుందో మరి. ఇది ఎందుకు చెపుతున్నాము అంటే మనస్సు అణిగినప్పుడే నీకు అంత శాంతివస్తూ ఉంటే, మరి మనోనాశనం అయినప్పుడు ఇంక ఎంతశాంతి వస్తుందో చూసుకోండి. మనోనాశనం వలననే మీకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది. మనోనిగ్రహాన్ని పెంచుకోండి. మేము మంచివారము, మేము చెడ్డవారము, మేము గొప్పవారము, మేము తక్కువ వారము ఇలా అనుకోవటం వదిలేయండి. అనుకోవటాలు మానివేస్తే మనస్సు పెరగదు, అది నశిస్తుంది. సన్యాసి నేను సన్యాసిని అనుకొంటాడు, గృహస్థుడేమో నేను గృహస్థుడను అనుకొంటున్నాడు. అలా అనుకొనేది మనస్సే, ఇలా అనుకొనేది మనస్సే, చివరకు మనస్సు అక్కడ మిగిలిపోతుంది. వాడికీ ఆత్మచింతన లేదు, వీడికీ ఆత్మచింతన లేదు. జీవితం పొడుగునా ఇలా ఏదో ఒకటి అనుకొంటూ కూర్చొంటే వీడికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. భగవాన్ రిపీటెడ్‌గా చెప్పేది ఏమిటి అంటే మీరు అనుకోవటం మానివేయండి, మీకోరికలు నెరవేరతాయి, మీకు ఆత్మజ్ఞానం కూడా కలుగుతుంది. రామాయణంలో సీతమ్మ హనుమంతునితో ఒకమాట చెప్పింది. నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఉండాలంటే, శాంతిగా ఉండాలంటే, నీరోజులు సుఖంగా వెళ్లాలంటే నీవు ఎవరిలోను దోషం చూడకు. నీవు రెస్ట్‌ఫుల్‌గా ఉండాలంటే, పీస్‌ఫుల్‌గా ఉండాలంటే ఎవరిలోను దోషం చూడకు. ఎవరిలోను చెడ్డచూడవద్దు, ఎవరి గురించి చెడుమాట్లాడవద్దు, చెడు వినవద్దు ఇవిఅన్నీ కాలక్షేపంకోసం చెప్పటంలేదు నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఉండటానికి ఇది చెపుతున్నాను అని సీతమ్మ హనుమంతుడితో చెప్పింది. మాకు రెస్ట్‌లేదు అని కొంతమంది అంటూ ఉంటారు, మీరు అన్నీ కల్పించుకొంటున్నారు ఇంక మీకు రెస్ట్ ఏమిటి? అందరిలోను మంచినే చూడండి, అందరిలోను బ్రహ్మమునే చూడండి అప్పుడు నీవు రెస్టుఫుల్‌గా ఉంటావు, అది తెలియక నాకు రెస్టులేదు అంటున్నావు. రాముడు ఒకసారి మాటల సందర్భంలో నీకు ఏమికావాలి అని లక్ష్మణుడిని అడిగాడు మీకు సేవచేయటం తప్పించి నాకు ఇంకోటి అవసరంలేదు, మీరు అడుగుతున్నారు కాబట్టి చెపుతున్నాను. మీకు సేవచేసుకొనే భాగ్యం ఇవ్వండి అని లక్ష్మణుడు చెప్పాడు. వాడు భక్తుడు, అటువంటి వారికి భగవంతుడు అన్నీ ఇచ్చి మోక్షంకూడా ఇస్తాడు. భగవంతుడు మనకు నోరును ఇచ్చాడు ఆనోటితో భగవంతుడి నామం స్మరించుకోవటం మానివేసి, దోషాలు మాట్లాడు కోవటానికి ఉపయోగించుకొంటున్నాము అంటే పాపం పోగుచేసుకొంటున్నాము. నోటి ద్వారా మనం పుణ్యం సంపాదించుకొంటే మంచిదే కాని పాపాన్ని సంపాదించుకొంటున్నాము. ఒకరకంగా మనకంటే పశువులే మెరుగు ఎందుచేతనంటే వాటికి నోటితో మాట్లాడే శక్తిలేదు. మాటల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మాట సౌమ్యంగా ఉండాలి, ఇతరులకు హితవుకలుగజేసేదిగా ఉండాలి, భగవదనుభవం పొందటానికి వారికి దారిచూపించాలి.

ఏదోఉంది, ఏదోఉంది అని అనుకొంటున్నావు. ఏదోఉంది అని అనుకోవటం వలన భయం కలుగుతుంది. ద్వైతంలోనుండి దుఃఖంవస్తుంది, భయంవస్తుంది, కోరిక వస్తుంది. ఏదోఉంది అని అనుకొంటున్నావు గాని ఏమీలేదు. ఉన్నదంతా ఈశ్వరుడే. ఉన్నది ఆయన ఒక్కడే అనేటువంటి సజీవమైన విశ్వాసం నీకు భగవంతుడి మీద ఏర్పడితే నదికి వరద ఎలా వస్తుందో అలాగ ఆయన అనుగ్రహం వెల్లువైవచ్చి నీసహస్రారాన్ని ముంచుతుంది. ఆయన అనుగ్రహం ముందు, ఆయన ప్రేమముందు నీ ఇంద్రియాలు స్వాధీనం అవ్వటం, నీ మనస్సు స్వాధీనం అవ్వటం ఏపాటివి. కోటీశ్వరుడు కూటికోసం ఎలా తిరగడో అలాగే బ్రహ్మానుభవం పొందిన వాడు స్వర్గానికి వెళ్లాలి, వైకుంఠానికి వెళ్లాలి అనిఏమీ అనుకోడు, ఎందుచేతనంటే బ్రహ్మానికి భిన్నంగా వాడికి ఏమీ కనిపించదు, అంతా బ్రహ్మమే, ఇంక ఎక్కడికో వెళ్లాలనే తలంపే వాడికి రాదు. మీ మనస్సు ఏ ఆకర్షణకు లొంగకుండా, బాహ్యానికి వెళ్లకుండా చూసుకోండి. ఇప్పుడు మీకు ఏదైతేనేనుగా వ్యక్తమవుతోందో అది పూర్తిగా కరిగిపోవాలి. ఈనేనును హృదయంలోనికి పంపగలిగితే, అక్కడ ఉంచగలిగితే అది కరిగిపోతుంది. ఇప్పుడు మనం ఎలాఉన్నాము అంటే ఈ మూలతలంపు వెళ్లి హృదయగుహలో పడిపోదామన్నా, పడనివ్వకుండా దానిని పట్టుకొంటున్నాము, మన తెలివితేటలు ఇలా ఉన్నాయి. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే

మీరు దానిని బలవంతంగా పట్టుకొని తీసుకొని వెళ్ళనక్కరలేదు. మీరు చేసేపని నిర్మలంగా చెయ్యండి. మనకు ఏది మంచి అనుకొంటున్నామో అదే ఇతరులకు చేయాలి, ఇతరులు ఏదిచేస్తే మనం సంతోషిస్తున్నామో, మనం కూడా అదే ఇతరులకు చెయ్యాలి. అలాగ మనప్రవర్తన సరిచేసుకొంటే నీకు తెలియకుండానే ఈనేను వెళ్ళి హృదయంలో ఉన్న బ్రహ్మంలో ఐక్యమయిపోతుంది. మనమాటలో గాని, చేతలో గాని, ఆలోచనలో గాని గర్వంలేకుండా చూసుకోవాలి. కొంతమంది గొప్పలకోసం డబ్బు ఉన్న వారితోటి, గర్వం ఉన్నవారితోటి స్నేహంచేస్తారు. వారి డబ్బు మనకు ఎలాగరాదు, వారి అలవాట్లు మనకు వచ్చేస్తాయి, ఇది మరీప్రమాదం. మనం ఇష్టాలు అయిష్టాలు పెంచుకొంటున్నాము. ఇలా రాగద్వేషములతో, కోరికలతో ఈ నేనును గట్టిగా పట్టుకొంటున్నాము, అది హృదయగుహలో ఐక్యమవ్వకుండా చేస్తున్నాము. మనమీద ఎవరికైనా ద్వేషం ఉంది అనుకోండి, అది మనం పట్టించుకోకూడదు. అవి అన్నీ పట్టించుకొంటే మనకు తెలివి లేదు అని అర్థం. వారి గొడవ నీకు ఎందుకు? నీ మనస్సును స్నేహితుడిగా చేసుకో, నీ మనస్సు నిన్ను బాగుచేస్తుంది కాని వారు ఏమీ బాగుచెయ్యరు, నీవు పాడయిపోతే చూసి సంతోషిస్తారు. ఇటువంటి వారిని భుజాన వేసుకొని తిరుగుతావు ఏమిటి? నీ ప్రవర్తన జాగ్రత్తగా చూసుకో. నీవు ఎవరితోనైనా ఏదైనా మాట్లాడినా మాట మాటకోసమే మాట్లాడు, అవసరం లేకపోతే మాట్లాడవద్దు, పనికూడా అంతే అక్కడ అవసరం అనుకొంటే పనిచెయ్యి లేకపోతే మానివెయ్యి. అంతేగాని కేవలం వ్యాపారధోరణితో ఏదీ చెయ్యవద్దు. వ్యాపారధోరణి వలన అహంభావన పెరుగుతుంది. మీపట్ల వారి ప్రవర్తన ఎలా ఉన్నా, మీరు ఎలా ప్రవర్తించాలో చూసుకొని అలా ప్రవర్తించండి, దానివలన మీ మనస్సు అణుగుతుంది. మీరు గొప్పవారు అని వారు అనటం వలన మీకు వచ్చేలాభం లేదు, మీరు తక్కువవారు అనటం వలన మీకు వచ్చే నష్టంలేదు. ఆమాటలతో తాదాప్యం పొందటం వలన మీ అహంభావన పెరుగుతుంది, మీరు పతనమవుతారు.

మనకు సంకల్పం లేకపోతే, తలంపు లేకపోతే పనిఅవ్వదు అని మనం అనుకొంటున్నాము. అది మనలో ఉన్న పెద్దజబ్బు. మన తలంపు నిజంకాదు. ఈశ్వరసంకల్పం ప్రకారం మన జీవితయాత్ర జరుగుతుంది. మనం చాలా అనుకొంటాము అలా మనం అనుకొన్నట్లు అన్నీ జరుగుతున్నాయా, లేదు. ఎందుచేతనంటే మనది సత్యసంకల్పంకాదు, ఈశ్వరుడిది ఒక్కటే సత్యసంకల్పం. సత్యసంకల్పం నెరవేరుతుంది కాని మన సంకల్పం నెరవేరదు. అందుచేత భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చెయ్యి అశ్రద్ధపనికిరాదు. ప్రేమతో చెయ్యి ద్వేషంగా చెయ్యవద్దు. ఆపనిచేయటం వలన నీకు





ఏదో రావాలని అనుకోవద్దు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదోరాదు. నీకోరికతో సంబంధం లేకుండా వచ్చినది నిన్ను బంధించదు. నువ్వుకోరికతో తెచ్చుకొన్నది నిన్ను బంధిస్తుంది. భగవంతుడునీ దేహప్రారబ్దాన్ని బట్టి నీకు ఏది కేటాయిస్తే దానితోటి సంతృప్తిగా ఉండు. నీవు అన్నంతినేటప్పుడు కూడా అది నీది అనుకొని తినవద్దు, భగవంతుడిదే అనుకొని తిను, అలా అనుకొంటే అది ప్రసాదమవుతుంది. ఎందుచేతనంటే సంపద అంతా ఆయనదే, ఆసంపదలో నీ ప్రారబ్దానికి ఎంత కేటాయించాడో అంత నీవు ఎంజాయ్ చెయ్యి కాని అది నీది అని అనుకోవద్దు. నీది అనుకొని దానిని అనుభవిస్తే అహంభావన పెరుగుతుంది, ఏపెంటనయితే పోగొట్టుకోవాలి అని నీవు అనుకొంటున్నావో అది పెరిగిపోతుంది. అంతా ఆయనదే అనుకొని జీవిస్తూఉంటే అహంభావన కరిగిపోతుంది. నేను అనే తలంపును పోగొట్టుకోవటానికి రెండు మార్గాలను భగవాన్ చెపుతున్నారు. ఈనేను అనేతలంపు ఎక్కడనుండి ఉదయించివస్తోందో అక్కడకు తీసుకొనివెళ్ళి లయంచేసినా అది నశిస్తుంది లేకపోతే అంతానీ ఇష్టమే, నీసంకల్పమే నెరవేరుతుంది, నీసంకల్పమే నా సంకల్పం అని భగవంతుడికి శరణాగతిచెందు, ఈనేనును ముస్తాబుచేయటం మానివేసి జీవిస్తూఉంటే ఈనేను నశిస్తుంది. మనకు ఇష్టంఉన్నా, ఇష్టం లేకపోయినా భగవంతుడు చెప్పినట్లుగా జీవిస్తూఉంటే ఆయన మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నీకు ఏదివచ్చినా అదిఅంతా ఈశ్వరుని ప్రసాదమే, మీ ఇంట్లో అందరూ మీరంటే ఇష్టంగా ఉంటారు అనుకోండి, అది ఈశ్వరుని ప్రసాదమే, మీరంటే ఇష్టంగా ఉండరు అనుకోండి, అదీ ఈశ్వరుని ప్రసాదమే ఎందుచేతనంటే వారి హృదయంలో కూడా ఈశ్వరుడు ఉన్నాడు. రోజూ మీతో మాట్లాడే వారు మాట్లాడటం మానివేస్తారు అనుకోండి అయ్యో ఏమిటి ఇలా మాట్లాడటం మానివేసారు అని మీ మనస్సులో అశాంతివస్తోంది అనుకోండి, మీకు భక్తిలేదని అర్థం, మీకు శరణాగతిలేదని అర్థం. మీకోడలే సడన్‌గా మీతో మాట్లాడటం మానేస్తుంది అనుకోండి. మీ కోడలు మాట్లాడినప్పడు మిా మనస్సు ఎలా ఉందో, మాట్లాడనప్పడుకూడా మీ మనస్సు అలాగే ఉంటే అది మీ శరణాగతికి గుర్తు, అప్పడు ఈశ్వరుని దయ మీ మీద వర్షిస్తుంది. మీ ఇంట్లో అందరూ నీకు అనుకూలంగా ఉంటే మంచిదే, అనుకూలంగా లేరు అనుకో అందులో కూడా లాభంఉంది, వారి మీద మమకారం తగ్గుతుంది, మరణసమయంలో వారు జ్ఞాపకంరారు, భగవంతుడు జ్ఞాపకం వస్తాడు. ఏస్థంబాలను ఆధారంగా పెట్టుకొని మన అహంకారం నిలబడుతోందో ఒకోసారి భగవంతుడు ఏమిచేస్తాడు అంటే కావాలని ఆస్థంబాలను ఊడగొడతాడు, వాటిని ఊడగొడితే కాని మన అహంకారం కూలిపోదు. కాని మనం ఏమనుకొంటాము అంటే భగవంతుడు ఇలా చేస్తున్నాడు ఏమిటి అనుకొంటాము. మనలను ఉద్ధరించటానికే భగవంతుడు అలాగచేస్తున్నాడు అని గ్రహిస్తే

నీవు ధన్యుడవు.

ఉన్నదంతా ఒక్కటే అదే బ్రహ్మం, అదే భగవంతుడు, అందరి హృదయాలలో ఆయనే ఉన్నాడు, ఆడించే వాడు ఆయనే ఈ శరీరాలు బొమ్మలు మాత్రమే. మీకు సహనం ఎంత ఉందో చూడటానికి ఒకోసారి పరీక్షలకు గురిచేస్తాడు. మీ బుద్ధిలో హెచ్చుతగ్గులు ఉంటే వాటిని సరిచేసుకోవటానికి కొన్ని పరిస్థితులు కల్పిస్తాడు. భగవంతుడు ఏదిచేసినా మన మంచికోసమే చేస్తున్నాడు అనే బుద్ధి మీకు కలిగితే అది శరణాగతి లక్షణం. భగవంతుడి ఇష్టమే మన ఇష్టమనుకుంటే ఆయన దయ మనమీద వర్షిస్తుంది. ఆయనమీద భారంవేసి జీవిస్తూ ఉంటే మనతలంపుతో సంబంధం లేకుండా, మనకోరికతో సంబంధంలేకుండా, మనం అనుకోవటాలతో సంబంధంలేకుండా మొత్తం పనులన్నీ కూడా మనం ఊహించిన దానికంటే బాగా పూర్తి అయిపోతాయి. శరణాగతిభావన వలన పనిఅవ్వదు అని అనుకోవద్దు, పనిఎలా అయితే బాగుంటుంది అని నీవు అనుకొంటున్నావో అంతకంటే బాగా జరిగిపోతుంది. ఇంత సృష్టిని నడిపే వాడికి మన పని పూర్తిచేయటం ఎంతసేపండీ. సూర్యుడు మనకు వెలుగునిస్తాడు, వేడినిస్తాడు. భగవంతుడు అలాకాదు మనకు కాంతి నిస్తాడు, చల్లదనాన్ని ఇస్తాడు, వాడు దేవుడు. భగవంతుడు మనకు కాంతినివ్వడమే కాకుండా ఇంద్రియాలకు చల్లదనం, మనసుకు చల్లదనం ఇస్తాడు. శరీరమేకాదు మన మనస్సుకూడా ఏ.సిలో ఉన్నట్లు చేస్తాడు ఎంత చల్లదనాన్ని ఇస్తాడు అంటే ఏమిటి మనకు శరీరం ఉందా లేదా అని మీకే అనుమానం వస్తుంది, శరీరాన్ని అంత తేలిక చేసేస్తాడు, వాడు ఈశ్వరుడు. అందుచేత శరణాగతి వలన పనులు పూర్తిఅవ్వవు అనుకోకండి, మీరు అనుకొన్నదానికంటే బాగా అవుతాయి అంటే మీకోసం పరిస్థితులను అలా మలుపు తిప్పతాడు. మనం మినహాయింపులు లేకుండా ఆయనకు పూర్తిగా శరణాగతి చెందినప్పడు ఆయనను ప్రేమిస్తున్నప్పడు మన తలంపుతో సంబంధం లేకుండా మనం అనుకున్నదానికంటే బాగా ఆపనిని పూర్తి చేసిపెడతాడు, వాడు భగవంతుడు, మన యజమాని ఆయనే, మనం చేసేపనికి ఫలితాన్ని ప్రసాదించే వాడు ఆయనే, ఆయనే సర్వసమర్థుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు 24-4-04 - జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు శంకరజయంతి. మనకు ఆచార్యులు ముగ్గురు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, ప్రథమ ఆచార్యుడు శంకరాచార్యుడు, ఆయన శివుడి యొక్క అంశ అని చెపుతారు. శంకరాచార్యులు కేరళరాష్ట్రంలోని కాలిడిలో జన్మించారు.





ఆయన 32 సం॥లు ఈ భూమి మీద ఉన్నారు. ఆచార్యులవారి తండ్రి శివగురువు, తల్లి ఆర్యాంబ. ఆచార్యులవారు గొప్ప రచయిత, ఆయన విద్యాస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, బోధస్వరూపుడు, ఆయన ఏదైనా వ్రాస్తే, ఏదైనా చెపితే దానిలో శాస్త్రపరిజ్ఞానమే కాకుండా, ఆయన అనుభవం కూడా ఇమిడిఉండేది. ఆయన అంటే నాకు పరమప్రీతి, ఆయన మీదఉన్న ఇష్టాన్ని దాచుకోలేకపోతున్నాను, ఆయన మాటలను చెప్పకుండా ఉండలేను.. ఆయన వేదస్వరూపుడు, పురాణస్వరూపుడు, ఇతిహాసస్వరూపుడు. ఆచార్యులవారి తల్లితండ్రులకు చాలాకాలం సంతానం కలుగలేదు. వారు త్రిచూరు శివాలయాన్ని ఎక్కువగా దర్శించి, కుమారుడిని ఇమ్మని ప్రార్థించేవారు. ఒకసారి శివుడు శివగురువుకు స్వప్నంలో కనిపించి జ్ఞాని పండితుడు అయి తక్కువకాలం జీవించే కొడుకు కావాలా లేక ఏమీ ప్రత్యేకత లేకుండా 100 సం॥లు జీవించే కొడుకు కావాలో ఆలోచించి చెప్పమని చెపుతాడు, కాని శివగురువు వెంటనే నాకు పండితుడు, జ్ఞాని అయిన కుమారుడు కావాలి అని చెపుతాడు. అప్పడు శివుడి అంశతో ఆచార్యులవారు జన్మించారు అని చెపుతారు. ఆచార్యులవారు అపరమేధావి, గొప్ప జ్ఞాపకశక్తికలవాడు. ఆచార్యులవారికి 5వ సం॥లో ఉపనయం చేసారు. ఆయనకు 8 సం॥లు వచ్చేసరికి సంపూర్ణుడు అయిపోయాడు, ఆయనకు తెలియని సబ్జక్టులేదు. ప్రమాణాలను వదులుకొని, సదాచారాన్ని వదులుకొని జీవించేవాడు ప్రమాదంలో పడతాడు అని ఆచార్యులవారు చెప్పారు. మనకు ఉపనిషత్‌లు, భగవద్గీత ప్రమాణం, వాటికి అనుగుణంగా జీవించటంమానేసి మన ఇష్ట ప్రకారం, అహంకారం చెప్పినట్లుగా జీవిస్తూ ఉంటే ప్రమాదంలో పడతాము. వేదాలు ఆర్డరుచేసినట్లు చెపుతాయి, పురాణాలలో ఈ పనిచేస్తే ఈఫలితం వస్తుంది అని చెపుతారు, ఇతిహాసాలు స్నేహపూర్వకంగా చెపుతాయి. ఆచార్యులవారు వేదాలలో చెప్పినట్లు, పురాణాలలో చెప్పినట్లు, ఇతిహాసాలలో చెప్పినట్లుగా కూడా చెప్పేవారు. ఆయనకూడా కొన్ని మహిమలు చేసారుకాని మన మనస్సును మహిమల మీదకు వెళ్ళనివ్వరు. మహిమలు అనేవి ప్రకృతిగొడవలు, మనకు సబ్జక్టుప్రధానం, ఆలోచన ప్రదానం.

ఆచార్యులవారికి సన్యాసం తీసుకోవాలని అనిపించింది. ఎవరైనా సన్యాసం తీసుకోవాలి అంటే తండ్రి అనుమతి లేకపోయినా ఫరవాలేదు కాని తల్లి అనుమతి తీసుకోవాలి అని శాస్త్రంలో ఉంది. సన్యాసం తీసుకొంటానని తల్లితో చెప్పాడు కాని తల్లి అంగీకరించలేదు. ఒకరోజు ఆచార్యులవారు నదిలో స్నానం చేస్తున్నారు. తల్లి బట్టలు ఉతుకుతోంది. ఒక మొసలిని కల్పించి అమ్మా! నన్ను మొసలిలాగుకొనిపోతోంది, నేను చనిపోతున్నాను అని ఆచార్యులువారు అంటారు. తల్లికేకలు పెడుతుంది, ఆచార్యులువారు ఏమిచెప్పారు అంటే నేను సన్యాసం తీసుకోవటానికి అనుమతిస్తే ఈ మొసలి

విడిచిపెట్టేస్తుంది అని చెప్పారు. కొడుకు బతికిఉంటే చాలు అనుకొని ఆచార్యులవారు సన్యాసం తీసుకోవటానికి తల్లి అంగీకరించింది. అప్పుడు మొసలి విడిచిపెడుతుంది. ఆచార్యులువారు ఒడ్డుకు వచ్చి తల్లితో నేను ఇంటికిరాను. నీకు ఏమిలోటురాదు. మన ఆస్తిని బంధువులు అనుభవిస్తూ నిన్ను చూస్తారు అని తల్లితో చెప్పారు. తల్లి ఏమి చెప్పింది అంటే బంధువులను చూడమని చెపుతున్నావు బాగానే ఉంది కాని ఈ శరీరం ఏదో రోజు మరణిస్తుంది, దానికి నీ చేతులతో నిప్పపెట్టు అని తల్లి కోరుతుంది. అప్పుడు ఆచార్యులవారు తల్లితో నీకోరిక న్యాయంగా ఉంది, నీ చివరిరోజు నాకు తెలుస్తుంది, నేను వచ్చి దహనసంస్కారం చేస్తాను అని చెప్పి అక్కడనుండే వెళ్ళిపోయారు. మీకు ఎవరితోను స్పర్థలువద్దు, వైరభావంవద్దు. దయ, దానం, నిగ్రహం ఈ మూడు విడిచిపెట్టవద్దు అని చెప్పారు, శివుడు విషాన్ని మింగి ఆయన కంఠంలో పెట్టుకొన్నాడు. శివుడు త్యాగ పురుషుడు, వైరాగ్యపురుషుడు. ఆచార్యుల వారు శివుడితో ఏమన్నారు అంటే నా మనస్సు ఒకకోతి దానిని నీవు తీసుకో, నీకు పొట్ట వెళ్ళిపోతుంది, నాకు దానిగొడవ వదిలిపోతుంది. నీవు నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు, నీ పాదాలయందు భక్తిని ప్రసాదించు చాలు అన్నారు.

ఏ వస్తువుకయితే చావుపుట్టుకలు లేవో అది ఒక్కటే సత్యం. మిగతా గొడవలు అన్నీకూడా, మనం నోటితో చెప్పకొనే మాటలు అన్నీకూడా అశుద్దంతో సమానము అని ఏకనాధుడు చెప్పారు. వారు పొడవుగా ఉన్నారు, వీరు పొట్టిగా ఉన్నారు, వారుబాగా ఉన్నారు, వీరు పాడైపోయారు, వీరు తెల్లగా ఉన్నారు, వారు నల్లగా ఉన్నారు అని మనం చెప్పకొనే మాటలు అన్నీకూడా, ఈ వ్యవహారికగొడవలు అన్నీకూడా అశుద్దంతో సమానము అని చెప్పారు. ఆచార్యులవారి గురువు గోవిందపాదుడు. నీవు ఎవరు అని ఆచార్యులవారిని గోవిందపాదుడు అడిగితే నేను శరీరాన్ని కాదు, నేను మనస్సనుకాదు, నేను ఇంద్రియాలనుకాదు, నేను బ్రహ్మమును అని చెప్పారు. గోవిందపాదుడు ఏమిచెప్పాడు అంటే ఇక్కడ ఒక సంవత్సరం ఉండి విద్యను అభ్యసించమని చెప్పాడు. ఆచార్యులు వారు అక్కడ ఉండగా నదికి వరదవస్తుంది, వరదనీరు గురువు ఉన్న గుహ దగ్గరకు వచ్చేస్తుంది, గురువు గారు సమాధిస్థితిలో ఉన్నారు. అప్పుడు ఆచార్యులవారు తన కమండలాన్ని అక్కడ పెట్టారు. వరదనీరునంతా ఆకమండలం లాగేస్తుంది. ఈ విషయం ఆచార్యులవారు ఎక్కడా చెప్పలేదు. తరువాత అక్కడ ఉన్నవారు గురువుతో చెపుతారు. మనం ఏదైనా చిన్నపనిచేస్తే 10 సంవత్సరాలు చెపుతాము ఎందుచేతనంటే మనకు సాధనలేదు. ఒకసారి గురువుగారు ఆచార్యులవారిని పిలిచి నేను వెళ్ళిపోతున్నాను, ఇది నా జీవితానికి చివరి రోజు, నేను నిన్ను కోరేది ఏమిటి అంటే నీవు ఇక్కడ ఉండవద్దు, కాశీ వెళ్ళిపో. అక్కడ చాలామంది పండితులు ఉన్నారు, వారి తెలివి ఒక క్రమంలోలేదు, ఒక ప్రమాణంలో బోధించటంలేదు, నీవు వారిని సరిదిద్దు, హిందూమతం ఒక పద్ధతిలో నడవటంలేదు. మనుషులను, జంతువులను బలిపెట్టటం, భక్తి రాక్షసభక్తిగా తయారవుతోంది. వేదంలో చెప్పినట్లుగా హిందూమతంలేదు. అందుచేత దానిని సంస్కరించి హిందూసంస్కృతిని, నాగరికతను నీవు కాపాడు అని చెప్పాడు. నిద్రలోనికి వెళ్ళినప్పడు మన చేతిలో ఉన్న వస్తువు ఎలా జారిపోతుందో అలా గురువుగారు శరీరాన్ని విడిచిపెట్టారు. తరువాత గురువుమాట ప్రకారం ఆచార్యులవారు కాశీవెళ్ళారు. ఉన్నది ఒక్కటే వస్తువు, దానినే అనేక పేర్లతో పిలుస్తున్నారు మార్గాలు అనేకంగాని గమ్యం ఒక్కటే. వేదాలయొక్క సారం అద్వైతానుభవమే. సాధన అనేది ద్వైతానికి సంబంధించినది కాని మనం అద్వైతానుభవం పొందాలి అని చెపుతూ పండితులు ఎక్కడయితే పొరపాట్లు చేస్తున్నారో వాటిని సరిదిద్దాడు. ఉపనిషత్‌లకు, బ్రహ్మసూత్రాలకు బాష్యాలువ్రాసాడు. వేదాలసారాన్ని, పురాణాలసారాన్ని హృదయంలో పెట్టుకొని అందరికీ అర్ధమయ్యేటట్లు ఆయన సొంతమాటలతో ప్రకరణగ్రంధాలు వ్రాసాడు, స్తోత్ర గ్రంథాలు వ్రాసాడు. ఆయనకు యశస్సు, జ్ఞానం, ఐశ్వర్యం అన్నీ ఉన్నాయి. మనకు డబ్బు ఉంటే, పొలాలు ఉంటే అది ఐశ్వర్యం అనుకొంటున్నాము కాని దానిని ఐశ్వర్యం అని అనరు, దానిని సంపద అంటారు. సంపదవేరు, ఐశ్వర్యంవేరు, ఐశ్వర్యం అంటే ఈశ్వరుని పాదాలయందు భక్తి కలిగిఉండటం, సంపద అనేది భౌతికమైనది. నీకు భక్తిలేదు అనుకోండి, భగవంతుడు ఉన్నాడు అనే నమ్మకంలేదు అనుకోండి నీకు సంపద ఉన్నా కూడా ఐశ్వర్యం లేనట్టే.

శంకరాచార్యులవారికి ముఖ్యమైన శిష్యులు నలుగురు. పద్మపాదుడు, తోటకాచార్యుడు, హస్తామలకుడు, సురేశ్వరాచార్యులు. శరీరం వెంట నీడ ఎలా ఉంటుందో అలాగ వీరు నలుగురు ఆచార్యులవారు ఎక్కడఉంటే అక్కడ ఆయనకు నీడలాగ ఉండేవారు. నీకు ఎంత ధనం ఉన్నా, కీర్తి ఉన్నా, అధికారం ఉన్నా బుద్ధిలో పక్వతలేనప్పడు వాటివలన ప్రయోజనంలేదు. అన్నింటిలోను పక్వత అవసరం, పక్వతలేనప్పడు ఎన్ని ఉన్నా అవి ఒకటి లేని సున్నలతో సమానము అనిషేక్స్ఫియర్ చెప్పాడు. ఇవి సరదా కోసం చెప్పిన మాటలుకాదు, వారు సమాధిస్థితికి వెళ్ళి అనుభవించి చెప్పినమాటలు. అనుభవం ఉన్న గురువు దొరికితే బాగుండును అని పద్మపాదుడు అనుకొంటాడు., ఒకసారి ఆచార్యులవారు మణికర్ణికాఘాట్‌లో ఆయనకు ఎదురుపడతారు. ఈ రోజుగురువు దొరికాడు అనుకొన్నాడు, తేజస్సు నడిచివస్తోంది అని అనిపించి పద్మపాదుడు ఆచార్యులవారికి నమస్కరించాడు, మొదటిచూపులోనే ఆకర్షించుకొన్నారు, చివరివరకు పద్మపాదుడు ఆచార్యులవారిని విడిచిపెట్టలేదు. ఇప్పడు అయితే శనివారం స్నేహాలు, ఆదివారం విరోధాలు.

ఆచార్యులవారు చాలాకాలం కాశిలో ఉండి పండితులనందరిని సమావేశపరచి, పండితులనందరిని జయించి, వారిని ఒక క్రమపద్ధతిలోనికి తీసుకొనివచ్చి, అద్వైత

సిద్దాంతాన్ని స్థాపించాడు. ఆచార్యులవారు 4 మఠాలను స్థాపించారు. దక్షిణభారతదేశంలో శృంగేరి మఠంపెట్టి దానికి సురేశ్వరాచార్యులను అధిపతిని చేసారు, పూరీలో గోవర్ధనమఠంపెట్టి దానికి పద్మపాదుడిని అధిపతిగా చేసారు, బదరీలో జ్యోతిర్మఠం పెట్టి దానికి తోటకాచార్యులను అధిపతిని చేసారు, ద్వారకలో శారదామఠం పెట్టిదానికి హస్తామలకుడిని అధిపతిగా చేసారు. ఇలా నాలుగు మఠాలు స్థాపించి, నలుగురు శిష్యులను అధిపతులను చేసి వారితో ఏమి చెప్పారు అంటే మీరు కేవలం ధర్మాన్ని ప్రచారం చేయటమేకాదు, జ్ఞానాన్ని బోధించటమే కాదు ప్రజల క్షేమాన్ని కూడా చూడండి, ప్రజల కష్టాలను గమనించి వాటిని అర్ధంచేసుకొని, పరిపాలన చేసే రాజులకు చెప్పి ప్రజల సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నం చేయండి అని ఆచార్యులవారు చెప్పారు. మానవుడు జీవితాన్ని ఎలా వ్యర్ధం చేసుకొంటున్నాడు అంటే చిన్నతనంలో ఆటలు ఆడుకొంటూ కాలక్షేపం చేసేస్తాడు, వయస్సులో ఉన్నప్పుడు కుటుంబంకోసం ఆలోచిస్తూ ఎలా సంపాదించాలి అనిచూస్తూ ఉంటాడు, ముసలితనంలో జరిగిపోయినగొడవలు తలపెట్టుకొంటూ ఏడుస్తూ కూర్చొంటాడు ఇలా కాలాన్ని పాడుచేసుకొంటాడు కాని చనిపోయే రోజు దగ్గరకు వస్తోంది అని అనుకోడు. ఆచార్యులవారి దగ్గర గొప్పతనం ఏమిటి అంటే సమన్వయం ఉంది. ఆయన నిరాకారుడు, నిర్గుణుడు. సాకారాన్ని కూడా గౌరవించేవాడు. ఆయన ఎక్కడకు వెళితే అక్కడ దేవాలయాలను దర్శించి, అక్కడ పూజా విధానం సరిగా లేకపోతే వారికి పూజా విధానాన్ని చెప్పేవారు. ఆయన పండితుడు, సంస్కర్త, మేధావి, కవి, మహాసన్యాసి, మహాఆచార్యుడు, మహాజ్ఞాని. బుద్ధి శుద్ధిగా ఉంటే సరిపోదు నోరుకూడా శుద్ధిగా ఉండాలి. మీనోటిలో జున్ను ముక్క పెట్టుకొంటే ఆరుచి వెంటనే తెలుస్తుంది కాని సాధన చేసేటప్పుడు లోపల ఉన్న వస్తువు వెంటనే తెలియదు, ఆరుచి తెలియటానికి కొద్దిటైము పడుతుంది, నెమ్మదిగా తెలుస్తుంది అని ఆచార్యులవారు చెప్పారు. ఆయన రోజూ మూడు పనులు చేసేవారు. ఉపనిషత్‌లసారాన్ని, వేదాలసారాన్ని వ్రాయటం, ఎవరైనా వస్తే వారిని కూర్చోబెట్టి ప్రేమతో బోధచేయటం, తన ముఖ్యశిష్యులతో ఎంతో చనువుగా ప్రేమగా మాట్లాడటం, తన హృదయాన్ని తీసి వారి దగ్గరపెట్టేవారు ఈ పనులు రోజూ చేసేవారు.

తల్లి అవసానదశలో తల్లికి ఇచ్చినమాట ప్రకారం ఆచార్యులవారు తల్లి దగ్గరకు కాలిడివచ్చారు. నీకు ఏమీచేయలేదు ఇప్పుడు ఏమి కావాలి అని తల్లిని అడుగుతాడు. విష్ణువు యొక్క దర్శనం కావాలి అని తల్లి అడిగితే విష్ణుదర్శనం అయ్యేటట్లు చేస్తాడు. ఆ రూపాన్ని చూస్తూ ఆవిడ ప్రాణాన్ని విడిచి పెట్టింది. అప్పుడు కుటుంబసభ్యులు ఏమన్నారు అంటే నీవు సన్యాసివి, నీవు దహనసంస్కారం చేయటానికి వీలులేదు, మేము చేస్తాము అంటారు. ఆచార్యులువారు ఏమన్నారు అంటే తల్లికోరిక నెరవేర్చటానికి ఇక్కడకు వచ్చాను. మీరు శాస్త్ర విరుద్దం అంటున్నారు కాని తల్లి కోరిక నెరవేర్చటం నాధర్మం అంటాడు. వారు అంగీకరించలేదు, నిప్ప ఇవ్వము అన్నారు, శవాన్ని మోయలేదు. అప్పడు ఆయనే నిప్పను సృష్టించి తల్లికి దహనసంస్కారం చేసారు. ఆయన చివరిరోజులలో శిష్యులతో కలిసి కేదారి వెళ్ళారు. చివరిరోజు వరకు పాఠాలు చెపుతూనే ఉన్నారు. చివరిరోజున శిష్యులతో మీరు ఈ శరీరాన్ని రక్షించారు, బట్టలు ఇచ్చారు, అన్నం పెట్టారు, కావలసినవి అన్నీ సమకూర్చారు, మీకు కృతజ్ఞుడను. ఈరోజు సూర్యుడు ఎప్పుడయితే అస్తమిస్తాడో అప్పుడు ఈశరీరం పడిపోతుంది అని చెప్పారు. మేము పెట్టిన అన్నానికి, ఇచ్చిన బట్టలకు కృతజ్ఞత చెపుతున్నారు మట్టిలాంటి మమ్మలను బంగారం చేసారు. మీరు బోధించటమేకాదు, అది అనుభవంలోనికి వచ్చేటట్లుగా చేసారు మేము మీ ఋణం తీర్చుకోలేము, మీరులేని లోకాన్ని మేము చూడలేము, మీరు అనేక మహిమలు చేసారు, ఈ శరీరాన్ని నిలబెట్టుకోవాలి అని శిష్యులు అడిగారు. ఈ శరీరం వచ్చిన పని అయిపోయింది అని ఆచార్యులవారు చెప్పారు.

ఆయన శరీరం 32 సంవత్సరాలు ఈ భూమిమీద ఉంది. ఆశరీరంపోయిన ఆయన అనుగ్రహం, దయ మనమీద వర్షిస్తోంది. ఆయన బోధను మనం ఆస్వాదిస్తున్నాము. ఆయన బాష్యాలువ్రాసి, ప్రకరణగ్రంధాలు వ్రాసి మన శరీరం అంతా అమృతమయం చేయటానికి చూసారు. ఆయన చెప్పి విడిచిపెట్టటంకాదు, అది అనుభవంలోనికి తీసుకొని రావటానికి చూసారు. సత్యం అంటే ఏమిటి? సత్యంలో మోసం ఉండదు, సత్యంలో వంచన ఉండదు అని చెప్పాడు. అంటే వంచనకు అలవాటుపడిన వారికి, మోసానికి అలవాటుపడిన వారికి సత్యసాక్షాత్కారం కలుగదు అని చెప్పటం. ఏదైతే పొందాలో దానిని పొంది ప్రత్యక్షంగా అనుభవిస్తూ ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు ప్రమాణం చూపిస్తూ బోధించాడు ఆయన బోధ స్వరూపుడు. కొంతమందికి ఆత్మస్తుతి, పరనింద తప్పించి ఇంక ఏమీ ఉండదు, వారు ఎంత పండితులు అయినా, వారుకోటిజన్మలు ఎత్తినా వారికి సత్యసాక్షాత్కారం కలుగదు.

శరీరాలు వస్తాయిపోతాయి, చుట్టాలు వస్తారుపోతారు, స్నేహితులు వస్తారుపోతారు, ధనం వస్తుందిపోతుంది, అధికారం వస్తుందిపోతుంది. ఇవిఅన్నీ అంతే. ఏది ఎప్పుడూ శాశ్వతంగా ఉంటుందో, దేని స్వరూపం సుఖమో, దేని స్వరూపం శాంతో అది మన హృదయంలో ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి, అదే మన జీవితగమ్యం. ఇప్పుడు మేము సుఖంగానే ఉన్నాము అంటే మీరు అనుభవించే సుఖాలు అన్నీ మిద్యాసుఖాలు, ఆత్మసుఖం ఒక్కటే నిజమైన సుఖం, దానిని పొందటానికి ప్రయత్నంచెయ్యి. వేదాలలో చాలావిషయాలు చెప్పారుకాని మీరు బ్రహ్మం ఒక్కటే సత్యం, దానిని పొందు అని చెపుతున్నారు మరి అవి అన్నీ వేదాలలో ఎందుకు చెప్పారు అని ఆచార్యులవారిని అడిగితే

కర్మలు, కర్మఫలితాలు ఇవి అన్ని వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, పుణ్యం సుఖరూపంలో, పాపం దుఃఖరూపంలో ఖర్చు అయిపోతుంది, అది, ఇది కూడా ఉండదు. ఇవిఅన్నీ వ్యవహారిక సత్యాలు, ఇవిఅన్నీ స్వప్న సమానము. రాకలేనిది, పోకలేనిది బ్రహ్మం ఒక్కటే, నీ సాధనను దానిమీద గురిపెట్టు. చెరువులో నీరు ఉంటే కప్పలు, చేపలు చేరతాయి, మీ దగ్గర డబ్బు ఉంటే చుట్టాలు చేరతారు. చెరువులో నీరు లేకపోతే చేపలు ఏమిటి? మీ దగ్గర డబ్బులేకపోతే చుట్టాలు ఏమిటి? అలాగే తత్వం తెలిసినవాడికి సంసారం ఏమిటి? చావు ఏమిటి? పుట్టుక ఏమిటి? వేదాలలో చాలామాటలు చెప్పారు. వేదాల యొక్క అంతంలో ఉపనిషత్‌లు ఉన్నాయి, వాటిలోని సారాన్ని నీకు బోధిస్తున్నాను. ఈ రోజు పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాన్ని చెప్పమంటావా? దేనిని పొందితే సుఖం స్వరూపంగా వ్యక్తమవుతుందో, దేనిని పొందితే ఈ జననమరణ చక్రంలో నుండి విడుదలపొందుతావో దానిగురించి చెపుతున్నాను.

కోరిక, కోపం వస్తే అవి మన శరీరానికి, మనస్సుకు వేడిని తీసుకొని వస్తాయి. నీ శరీరాన్ని, మనస్సును పాడుచేసే గుణాలకు దూరంగా ఉండు. జీవలక్షణాలు ఉన్నప్పుడు వాడు ఇష్టుడు అని, వీడు అయిష్టుడు అని, వాడు మనవాడు అని వీడు పరాయివాడు అని మనకు అనిపిస్తుంది. జీవలక్షణాలు లేనప్పుడు ప్రియం ఎక్కడ ఉంది, అప్రియం ఎక్కడ ఉంది. బ్రహ్మజ్ఞాని వాడికి శరీరం ఉన్నా బ్రహ్మంతో తాదాప్యం పొంది ఉంటాడు. బ్రహ్మానికి ప్రియం ఎక్కడ ఉంది, అప్రియం ఎక్కడ ఉంది? ఏమిబోధ, అది ఆకాశగంగ. శరీరాన్ని మనస్సును స్వాధీనం చేసుకో, స్వాధీనమైన మనస్సు, స్వాధీనమైన శరీరం బ్రహ్మసాక్షాత్కారానికి సహకరిస్తాయి. నీవు చేసే పనికి ఒక గమ్యం ఉండాలి. నీవు తీర్థయాత్రలు చెయ్యి, సత్పురుషులతో సహవాసం చెయ్యి. వ్రతాలు చెయ్యి, నదులలో మునుగు కాని నీవు పొందవలసింది మాత్రం మర్చిపోవద్దు, గమ్యాన్ని మర్చిపోవద్దు. పుట్టుక యొక్క ప్రయోజనం బ్రహ్మజ్ఞానం పొందటం, అది మర్చిపోవద్దు అంటున్నారు ఆచార్యులవారు. మీరు మంచిగ్రంధాలు అధ్యయనం చేయండి. మంచికర్మలు చేయాలంటే చేయండి, కాశీ రామేశ్వరం చూడాలంటే చూడండి కాని ఏదైతే ఎప్పుడూ ఉంటుందో అది మర్చిపోవద్దు. మూడుకాలాలలో, మూడుఅవస్థలలోను ఏదైతేఉందో ఈ ప్రపంచం ఉన్నా, ప్రపంచం అంతా లయం అయిపోయినా ఏదైతేఉందో అదే బ్రహ్మం, అది స్వయం ప్రకాశం, అది సత్యం, జ్ఞానం, ఆనందం, అనంతం, దాని తాలుక నీడ ఈలోకం.

ఇప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఈ నేను ఉంటే నాదికూడా ఉంటుంది, ఈ నేను, నాది అనేవి జీవలక్షణాలు, ఇది ప్రకృతి. నీ లోపలఉన్న బ్రహ్మంకు నేను, నాది అనే తలంపులతో సంబంధంలేదు. ఈ ప్రకృతిలో నుండి విడుదల పొందటానికి నీ సాధన అంతా గురిపెట్టు. సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు. ఇది అంతా అబద్దం అని మీరు అనుకోవచ్చు. మీరు అబద్దం అనుకొన్నా తూర్పున ఉదయించటం మానడు. అలాగే లోపల ఏమీలేదు, ఏమీలేదు అని మీరు అనుకోవచ్చు కాని ఉన్నది ఎక్కడికిపోతుంది. నీకు తెలియటం, తెలియకపోవటం మీద అది ఆధారపడిలేదు. జీవుడు శరీరాన్ని ధరిస్తాడు. ప్రారబ్దం ఖర్చు అయిన తరువాత శరీరం చనిపోతుంది. జీవుడు ఇతరలోకాలకు వెళతాడు, అక్కడ అనుభవించవలసింది అనుభవించాక మరల శరీరం ధరించి పునర్జన్మలోనికి వస్తాడు. ఈ విషయాలు అన్నీ వేదంలో చెప్పారుకదా అవి చెప్పటం మానేసి బ్రహ్మం గురించి మాత్రమే చెపుతారు ఏమిటి అని అడిగితే అవి అన్నీ తాత్కాలిక విషయాలు, అవి అన్నీ మెరుపులు, అవి వస్తూఉంటాయి, పోతూఉంటాయి, అసలు వస్తువును పట్టుకో అని ఆచార్యులవారు చెప్పారు. ఆ విషయాలు అన్నీ వేదాలలో చెప్పారుకదా అని అంటే నిన్ను తయారుచేయటానికి, నీ బుద్ధికి పక్వత తీసుకొనిరావటానికి చెప్పారు. ఈ విషయాలు అన్నీ చెప్పలేదు అని నేను అనటం లేదు. మన శరీరానికి అన్నింటికంటేపైన తల ఉంది. మన శరీరంలో కాళ్ళు, చేతులు, పొట్ట ఇలా చాలా ఉన్నాయి. కాళ్ళు, చేతులు విరిగిపోతే బాగుచేసుకొంటాము, కాని శిరస్సు ప్రధానమైనది, శిరస్సుపోతే ఆ శరీరం పోయినట్లే. అలాగే వేదంలో అనేక విషయాలు చెప్పి ఉండవచ్చు కాని ఉదాత్తమైనది, నీవు తెలుసుకోవలసినది, నీవు సాధనచేసి పొందవలసింది ఆత్మజ్ఞానం. ఎన్ని విద్యలు ఉన్నా కూడా ఆత్మవిద్య ప్రధానమైనది, అందుకే ఆత్మవిద్యను బోధిస్తున్నాను అని చెప్పారు. బ్రహ్మం ఇలా ఉంటుంది, అలా ఉంటుంది అని తెలియకపోవచ్చు, అది నీమాటలకు, ఇంద్రియాలకు నీ బుద్ధికి అందకపోవచ్చుకాని నీఅనుభవానికి అందుతుంది, అది అనుభవైకవేద్యం, మల్లెపువ్వు ఎంత తెల్లగా ఉంటుందో, ఎంత స్వచ్ఛంగా ఉంటుందో మన మనస్సు అంత తెల్లగా, అంత స్వచ్ఛంగా అయితే భగవదనుభవం కలుగుతుంది అని ఆచార్యులవారు చెప్పారు. ఏదైతే నీ స్వరూపంగా ఉందో అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక మాట్లాడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీలేదు, చూడటానికి ఏమీ మిగలదు, ఇంక రాకపోకలతో సంబంధంలేదు. అంతటా నీవే ఉన్నప్పుడు ఎక్కడికి వెళతావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 21-05-2004 | శుక్రవారం | సఖినేటిపల్లి, సాయిబాబా మందిరం, మధ్యాహ్నం గం॥ 3-00లకు |
| 01-06-2004 | నుండి | |
| 08-06-2004 | వరకు | హైదరాబాద్ క్యాంపు |
| 20-06-2004 | ఆదివారం | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం |

## శ్రీ రామకృష్ణా జూనియర్ కాలేజి, నరసాపురం

**ది. 2-5-2004 ఆదివారం ఉదయం గం॥ 7-45 ని॥లకు నర్సాపురంలో కలెక్టర్ ఆఫీసు ప్రక్కన శ్రీ రామకృష్ణా జూనియర్ కాలేజివారిచే నిర్మించబడిన నూతన భవనమును తమ దివ్యహస్తములతో ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**







## పాలకొల్లులో ఘనంగా శంకర్ జయంతి ఉత్సవాలు



మానవులకు భక్తి, జ్ఞాన, వైరాగ్య ప్రబోధంచేసి, అజ్ఞానాంధకారం నిర్మూలించి ముక్తిమార్గ దర్శనం చేయడానికి, కైలాసంనుండి మానవరూపం ధరించి వచ్చిన శంకరుడే “ఆది శంకరాచార్యులు”, అనేక దేవతల ఉపాసనావిధానాలు, స్తోత్రాలు రచించి, అమూల్యమైన ఆధ్యాత్మిక వాఙ్మయ సృష్టిచేసి, అద్వైతమత స్థాపనాచార్యులై, భారతదేశం నలువైపులా పీఠాలు స్థాపించి, ఆధ్యాత్మికతేజం నింపిన దివ్యమూర్తి ఆదిశంకరులు. ఆ మహనీయమూర్తిని ఆరాధించి, ఆధ్యాత్మిక స్ఫూర్తిని పొంది, మానవులు తరించాలనే సదాశయంతో పవిత్ర పంచారామ పుణ్యక్షేత్రం, క్షీరారామలింగేశ్వర నిలయమైన “పాలకొల్లు” నందలి విజ్ఞులు, భక్తులు, సుమారు 75 సంవత్సరాల పూర్వం శ్రీ శంకరమఠం (కోడిగట్టున) నిర్మించి, ఆదిశంకరాచార్య, గణపతి, కాశీనుండి తెచ్చిన శివలింగము ప్రతిష్ఠించి పూజాకార్యక్రమాలు, ధార్మిక, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తూ, పట్టణానికి, సమాజానికి యధాశక్తిగా సేవలందించారు. ఈ మఠం స్థాపించి 7దశాబ్దాలు దాటినందున, “శంకరమఠం” ప్రస్తుతం శిధిలమై, జీర్ణావస్థకు చేరిన శంకరమఠాన్ని గత సంవత్సరం నవంబరు 15న పునరుద్ధరించి పూర్వవైభవాన్ని ఇనుమడింప చేసారు. శంకరజయంతి సందర్భముగా ఏప్రియల్ 24న నిర్వహించిన లక్ష బిళ్వార్చన వందలాది మంది భక్తులమధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ కంభంపాటి కామేశ్వరరావు గారు, ఆది శంకరాచార్యుల జీవిత చరిత్రను ప్రవచించారు. ఈ శంకరమఠాన్ని తిరిగి భక్తుల మనోభీష్టానికి అనుగుణంగా తీర్చిదిద్దడంలో క్షీరపురి బ్రాహ్మణ సేవాసంఘం చేసిన కృషి మెచ్చదగినది.